# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 138 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 27 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# నేపాల్‌లో వరద బీభత్సం.. 105 మంది భారతీయులు గల్లంతు!



### ఉత్తర నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన భోటేకోశీ నది- ఆకస్మిక వరదలకు 8 మంది మృతి, పలువురు గల్లంతు

**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**


హిమాలయ దేశం నేపాల్‌లో మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. టిబెట్ సరిహద్దు దిశ నుంచి ఉగ్రరూపం దాల్చి ప్రవహించిన భోటేకోశీ నది తీర ప్రాంతాలను ముంచెత్తింది. విపత్తులో ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందగా, సుమారు 400 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులతో పాటు, 37 మంది ఎన్ఆర్ఐలు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. ఈ వరద ధాటికి పలు గ్రామాలు వరద నీటిలో కొట్టుకు పోయాయి. ఆరు ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నేపాల్ సైన్యం హెలికాప్టర్లతో సహాయక చర్యలను ముమ్మరం చేసింది. టిబెట్ వైపు నుంచి ఒక్కసారిగా విరుచుకుపడిన భోటేకోశీ నది వరద ఉధృతి నేపాల్ ఉత్తర జిల్లాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కొండ లోయల గుండా బురద నీరు భారీ శబ్దంతో ముంచెత్తడంతో తీర ప్రాంత గ్రామాలు కొట్టుకుపోయాయి. నువాకోట్, ధాడింగ్ జిల్లాల నుంచి ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలను వెలికితీసినట్లు నేపాల్ పోలీసు ప్రతినిధి వెల్లడించారు. ఈ వరద తీవ్రతకు రసువా జిల్లాలో సహాయక చర్యల్లో ఉన్న 26 మంది నేపాల్ పోలీసులు, ఏడుగురు ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. అలాగే గల్లంతైన వారి కోసం నేపాల్ ఆర్మీ రంగంలోకి దిగింది. హెలికాప్టర్లు, విపత్తు నిర్వహణ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు తరలించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు ..మిగతా 2లో

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు.. ఆరుగురి దుర్మరణం

**ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు**

**మరో 20 మందికి తీవ్ర గాయాలు.. కొందరి పరిస్థితి విషమం హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా ఘటన**




**హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న కంటైనర్ లారీని ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 42 మంది ప్రయాణికులతో ఈ ప్రైవేటు బస్సు బయలుదేరింది. కోదాడ సమీపంలోని దొరకుంట వద్దకు రాగానే, జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్‌ను డ్రైవర్ గమనించకపోవడంతో వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఘోరం జరిగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ఉన్నారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉండగా, మరొకరి వివరాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమన్న కొండా మురళి

**సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు**

**కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమన్న కొండా మురళి**

**తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ.. ఆమెకు మాట్లాడే స్వాతంత్ర్యం ఉందని వ్యాఖ్య**

**గాంధీ కుటుంబంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని వెల్లడి**

**100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టీకరణ**

**ఓ బిల్లు విషయంలోనే డిప్యూటీ సీఎం భట్టిని కలిసినట్లు వివరణ**

**హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి నేడు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై తన కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. సుస్మిత వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కొండా మురళి స్పష్టం చేశారు. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, పార్టీ అధిష్ఠానం, గాంధీ కుటుంబంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. భట్టి విక్రమార్కను కలిసిన అనంతరం కొండా మురళి మాట్లాడుతూ.. "మా బిడ్డ వ్యాఖ్యలతో మాకు ఏం సంబంధం? మా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉంది. ఎవరి అభిప్రాయాలు ..మిగతా 2లో



## హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు లక్కీడ్రా

**ఆగస్టు 28 నుంచి 31 వరకు ఫ్లాట్ల కేటాయింపు**

**మొత్తం 40,900 మందిని అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం**

**మరో నాలుగు నియోజకవర్గాల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణం**

**టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించిన మంత్రి పొంగులేటి**

2లో..

## 22ఏ భూముల సమస్యపై ఉధృత పోరాటానికి సిద్ధం



**ప్రజల పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చడం అన్యాయం: మాధవరం కృష్ణారావు**


**ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం**

**అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం**

**ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండాలి...గుదిబండగా మారకూడదు..మాజీ మంత్రి హరీష్ రావు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ భూముల సమస్యపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్ తదితరులు పాల్గొని బాధితులతో భూసమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పట్టా భూముల్లో నివసిస్తూ, అన్ని చట్టబద్ధమైన ఆధారాలు కలిగి ఉన్న ప్రజల ఆస్తులను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఆస్తుల విషయంలో ప్రభుత్వం ..మిగతా 2లో



## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ముగ్గురు తెలంగాణ యువకుల దుర్మరణం**

**ఫ్లోరిడా రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**మృతుల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన రాహుల్ అనే యువకుడు మృతి**

**ఇంకా వెల్లడి కాని పూర్తి వివరాలు**

**హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోరిడా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మరణించిన వారిలో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ అనే యువకుడు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉన్నత ..మిగతా 2లో

# నేపాల్‌లో వరద బీభత్సం.. 105 మంది భారతీయులు గల్లంతు!

**మొదటి పేజీ తరువాయి...**

వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు

**స్తంభించిపోయిన రాకపోకలు**

భారీ వరద ప్రవాహంలో అనేక వాహనాలు, స్థానిక కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విలువైన సరుకులు కొట్టుకుపోయాయి. ఇటీవల కొత్తగా నిర్మించిన ఒక వంతెన సైతం వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు రసువా కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. వరద ధాటికి నేపాల్ విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. ఆరు ప్రధాన విద్యుత్ కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. నేపాల్‌లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకటించింది. పలు కీలక రహదారులు కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**384 మంది గల్లంతు**

వరద ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతైనట్లు నేపాల్ టూరిజం బోర్డు అధికారికంగా ప్రకటించింది. వీరిలో 105 మంది భారతీయులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 384 మంది ప్రయాణికుల ఆచూకీ లభించడం లేదు. వీరిలో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. విదేశీయుల్లో



అత్యధికంగా 105 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గల్లంతైన వారి కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ వరద విపత్తు నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ అప్రమత్తమైంది. నదీ పరీవాహక ప్రాంతాలైన రసువా, నువాకోట్, ధాడింగ్, చిత్వాన్, గోర్ఖా జిల్లాల ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ఈ వరదలకు రసువా పరిసరాల్లో కురిసిన వర్షపాతం కారణం కాదని నేపాల్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఎగువన ఉన్న హిమానీనద సరస్సు ఒక్కసారిగా తెగిపోవడం వల్లే ఇంత భారీ ఎత్తున నీరు ముంచెత్తి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం వరద వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను సేకరిస్తున్నారు.

**అత్యవసర సమావేశం**

విపత్తు తీవ్రత దృష్ట్యా నేపాల్ ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, మెడికల్ బృందాలు, స్కౌట్స్, రెడ్‌క్రాస్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సహాయం కోసం నేపాల్ పర్యాటక బోర్డు టోల్ ఫ్రీ నంబర్ 1234 లేదా హాట్‌లైన్ 1144 లేదా పర్యటక పోలీసుల నంబర్ 9851289445ను కూడా జారీ చేసింది.

నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా 0977 985 131 6807, 0977 970 910 7500 హెల్ప్‌లైన్ నంబర్లును జారీ చేసింది. మరోవైపు నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది. బిహార్ సీఎం సమ్రాట్ చౌధరీతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు.

# కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమన్న కొండా మురళి

**మొదటి పేజీ తరువాయి...**

వారికి ఉంటాయి. సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు" అని అన్నారు. సుస్మిత తనకు తగ్గట్టుగా తాను ఉంటుందని, ఆమె చేసిన వ్యాఖ్యలపై తాము బాధ్యత వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అదే సమయంలో సుస్మిత వ్యాఖ్యలపై తాను భట్టి విక్రమార్కతో చర్చించలేదని మురళి తెలిపారు. ఓ బిల్లు విషయంలో ఆయన్ను కలిసినట్లు వెల్లడించారు. మంత్రి కొండా సురేఖ అందుబాటులో లేరంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన తమకు లేదని కొండా మురళి స్పష్టం చేశారు. 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాజకీయాల్లో ఎవరి నిర్ణయాలు వారికి ఉంటాయని పరోక్షంగా వ్యాఖ్యానించారు.

ఈ వివాదానికి పరకాల అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ అంశం కేంద్రంగా మారింది. ఇటీవల పరకాలలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. దీనిపై సుస్మిత తీవ్రంగా స్పందించారు. పరకాల టికెట్‌ను రేవూరికి ఎలా ఖరారు చేస్తారని ప్రశ్నించడంతోపాటు, టికెట్లను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పే సీఎం.. పరకాల విషయంలో తానే నిర్ణయం ఎలా చెబుతారని నిలదీశారు.

సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఆమె చేసిన విమర్శలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ స్పందించింది. ఈ వ్యవహారంపై మంత్రి కొండా సురేఖకు వివరణ కోరుతూ నోటీసు జారీ చేసింది.

కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ పార్టీకి వివరణ ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తనకు సంబంధం లేదని పేర్కొంటూ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. అయితే, దీనిపై సమగ్రంగా విచారించిన క్రమశిక్షణా కమిటీ కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు నివేదిక సమర్పించింది. దీనిపై అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు.



# తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్

**అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టి**

**ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల

# టవర్స్‌కు లక్కీ డ్రా

**హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31 వరకు అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీ డ్రా ద్వారా ఫ్లాట్లను కేటాయించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. తొలి విడతలో 15 నియోజకవర్గాల్లో రూ.807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. మొత్తం 60,720 దరఖాస్తులు రాగా, క్షుణ్ణంగా పరిశీలించి 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎంపిక కానివారికి ఈఎండీ రూ.10 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు వివిధ ప్రాంతాల్లో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు మంత్రి షెడ్యూల్ ప్రకటించారు. 28న కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపురలో, 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి వంటి ప్రాంతాల్లో, 30న గాజుల రామారం, అంబర్‌పేట, 31న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీలలో డ్రా ఉంటుందని వివరించారు. అంతేకాకుండా, మరో నాలుగు నియోజకవర్గాల్లో కొత్తగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎల్‌బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో మొత్తం 1,920 ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. వీటికి సెప్టెంబరు 3 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

భవిష్యత్తు లక్ష్యంతో రాహుల్ కేవలం మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. అక్కడ ప్రయాణిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోవడంతో స్వగ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అమెరికా వెళ్లి కొద్దిరోజులకే రాహుల్ మృతి చెందాడనే వార్త వినడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదం ఏ వాహనంలో ప్రయాణిస్తున్నప్పుడు జరిగింది, అసలు ప్రమాదానికి గల కారణాలేమిటనే కోణంలో స్థానిక అమెరికన్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. రాహుల్‌తో పాటు ప్రమాదంలో మరణించిన మిగిలిన ఇద్దరు యువకుల వివరాలు, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. కాగా, రాహుల్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.


## అమెరికా మరో

# దుందుడుకు చర్య

**వీసా ఇంటర్వ్యూల నిలిపివేత**

**వాషింగ్టన్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార



కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.



చిరు వ్యాపారులతో ముచ్చటిస్తున్న బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్ తో పాటు ఇతర నాయకులు..

# యుపిఐ ఒక డిజిటల్ విప్లవం

**శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్**

**10 ఏళ్ల మైలురాయిపై వ్యాపారులు, వినియోగదారులతో చిట్ చాట్**

**అప్పుడు ఎద్దేవా చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు స్వయంగా వాడుతోంది: రవికుమార్ యాదవ్ ధ్వజం**

**శేరిలింగంపల్లి : ఆగష్టు 26, (ప్రభాత ఉదయం)**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో డిజిటల్ ఇండియా కింద తీసుకొచ్చిన యుపిఐ పేమెంట్స్ వ్యవస్థ దేశంలో ఒక విప్లవాత్మక మార్పును, చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు. యుపిఐ పేమెంట్స్ ప్రవేశపెట్టి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఆయన శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ లోని చిరు వీధి వ్యాపారుల కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ స్వయంగా కూరగాయలు, టీ కొనుగోలు చేసి యుపిఐ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేశారు. అనంతరం అక్కడి వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. పూర్వం చిన్న చిన్న షాపుల వద్ద ఎదురయ్యే చిల్లర సమస్యలు యుపిఐ వల్ల పూర్తిగా తొలగిపోయాయని, ప్రతిఒక్కరూ చాలా సులువుగా లావాదేవీలు చేసుకుంటున్నామని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం యుపిఐ ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం లాంటి వారు టి షాపులు, కిరాణా వ్యాపారులకు మెషిన్లు, ఇంటర్నెట్, వైఫై ఎవరు ఇస్తారంటూ తీవ్రంగా ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. కానీ ఈ రోజు చిన్న వీధి వ్యాపారి నుంచి పెద్ద మాల్స్ వరకు అందరూ యుపిఐ వాడుతున్నారని, చివరికి విమర్శించిన కాంగ్రెస్ నాయకులు కూడా డిజిటల్ చెల్లింపులనే ఆశ్రయిస్తున్నారని చెప్పారు. ఇకనైనా దేశ హితం కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే సంస్కరణలపై ఆధారాలు లేని విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబుల్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఎయిర్టెల్ వెంకటేష్, రమేష్ యాదవ్, వెంకటేష్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 22ఏ భూముల సమస్యపై

# ఉధృత పోరాటానికి సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆస్తుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. 22ఏ జాబితాలో చేర్చిన భూముల కారణంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. తమ భూములకు సంబంధించిన పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని 22ఏ జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తమ ఆస్తులను విక్రయించుకోలేక, బదలాయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని



పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే తాను ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమని మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని తెలిపారు.

**ప్రభుత్వం ప్రజలకు అండగా ఉండాలి**

జయప్రకాశ్ నారాయణ్ లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ.. "ప్రభుత్వం అంటే ప్రజలకు అండగా ఉండాలి.. కానీ ప్రజలకు గుదిబండగా మారకూడదు" అని అన్నారు. అన్ని చట్టబద్ధమైన ఆధారాలు ఉన్న భూములను 22ఏ జాబితాలో ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. భూముల విషయంలో ప్రజలను అనవసరమైన ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. అధికారులు కూడా సమస్యను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మౌలిక వసతుల అభివృద్ధి హరీశ్‌రావు మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, పార్కులు, ప్రజా రవాణా, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టకుండా ప్రజల భూముల విషయంలో వివాదాలకు దారితీసే నిర్ణయాలు తీసుకుంటోందని నాయకులు విమర్శించారు. 22ఏ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి. ప్రజల భూముల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, 22ఏ జాబితాలో చేర్చిన భూములను సమగ్రంగా పరిశీలించాలని నాయకులు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ఐక్యంగా పోరాడతామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబేహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబురావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు తదితర శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, భూ బాధితులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు





మిలాద్ ఉన్ నబీ ర్యాలీ లో పాల్గొన్న ముస్లిం సోదరులు



బందోబస్తులో పాల్గొన్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య లు



జర్నలిస్టు లను సన్మానించిన ముస్లిం సోదరులు

**బుద్వేల్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో ముస్లిం సోదరులు బుధవారం ఘనంగా ర్యాలీలు నిర్వహించారు. అతా పూర్ సర్కిల్ లోని చింతల్మెట్, సులేమాన్నగర్, ఎం ఎం పహడీ, నౌనెంబర్, కిషన్ బాగ్ తో పాటు అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో ర్యాలీలు జరిగాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, బుద్వేల్, ప్రేమావతిపేట్ ప్రాంతాలలో సైతం ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ ఎ సీతయ్య, రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్ లు బం దోబస్తు నిర్వహించారు.

## క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**బ్లాస్టింగ్ వల్ల బోరు నష్టపోయిన రైతుకు పరిహారం ఇప్పించాలి.**

**దుమ్ము వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలి: సి పి ఎం జిల్లా కార్యదర్శిప వెంకటస్వామి.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు26 (ప్రభాత ఉదయం)**



గట్టు మండలం సల్కాపురం గ్రామ శివారులో మెగా కంపెనీ వారు భారత్ మాల రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కంకర క్రషర్ మిషన్ వల్ల చుట్టు పక్కల పంటపొలాలు దుమ్ము, ధూళి తో నిండిపోయి రైతులు పంటలు నష్టపోతున్నారని,కంకర కోసం పక్కన ఉన్న జోగన్ గట్టు గుట్టలో పెద్ద పెద్ద రాళ్లను బ్లాస్టింగ్ పెట్టీ పగలగొడుతున్నారని,బ్లాస్టింగ్ శబ్దానికి భూమి కంపించి పక్కన సల్కాపురం గ్రామానికి చెందిన రైతు యేసు కు చెందిన వ్యవసాయ పొలంలో గత రెండు సంవత్సరాల క్రితం బోరు మోటార్ భూమిలో కుంగి పోయిందని,ఇట్టి విషయమై క్రషర్ కంపెనీ యాజమాన్యానికి ఆ రైతు గత సంవత్సర కాలంగా పిర్యాదులు చేసినా పట్టించు కోవడం లేదని,బోరు మునిగి పోవడము,నీరు లేక మూడు ఎకరాల భూమి బీడుగా మారడము చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం వల్ల రైతు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడని యేసు ఆత్మహత్యా యత్నానికి క్రషర్ కంపెనీ యాజమాన్యమే కారణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు.పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతున్న సల్కాపురం గ్రామానికి చెందిన రైతు ఏసును బుధవారం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి లో సిపిఎం జిల్లా కమిటీ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ... రైతు ఏసుకు జరిగిన నష్టానికి కారణం క్రషర్ కంపెనీ యాజమాన్యమేనని బోరు మోటార్ కు మరియు పంట నష్టానికి పూర్తిగా పరిహారం క్రషర్ కంపెనీ యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రషర్ నిర్వహణకు గుట్టల్లో రాళ్లు తీసుకోవడానికి దుమ్ము ధూళి పంట పొలాలు గ్రామాల్లోకి వస్తున్నందుకు వీటన్నింటికీ ప్రభుత్వ అనుమతులు జిల్లా అధికారులు పరిశీలించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు ఏసుకు పూర్తిగా నష్టపరిహారం కంపెనీతో ఇప్పించాలని డిమాండ్ చేశారు. హాస్పటల్లో రైతును పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు,వివి.నరసింహ ఉన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

**సిసి రోడ్డు పనులను పరిశీలించిన బిజెపి నాయకులు**

**రాజేంద్రనగర్,ఆగస్టు26(ప్రభాత ఉదయం)**

హైదర్గూడలోని బాలాజీ మిఠాయి బండార్ సమీపంలోని కాలనీలో చాలా రోజులుగా వర్షపు నీటి పారుదల సమస్యతో పాటు రహదారులు గుంతలమయమై అధ్వానంగా మారడంతో స్థానిక ప్రజలు,కాలనీవాసులు,వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.కాలనీలో రహదారులు దెబ్బతినడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎన్నోసార్లు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదులు చేశారు.స్థానికుల విజ్ఞప్తులకు స్పందించిన అధికారులు ముందుగా వర్షపు నీటిని సక్రమంగా తరలించేందుకు పైప్లైన్ పనులు చేపట్టి పూర్తి చేశారు.అనంతరం దెబ్బతిన్న రహదారిపై సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించి వేగంగా కొనసాగించారు.సీసీ రోడ్డు నిర్మాణంతో వర్షపు నీరు నిలిచిపోయే సమస్యకు కొంతమేర పరిష్కారం లభించడంతో పాటు కాలనీలో రాకపోకలు సులభతరం కానున్నాయని స్థానికులు తెలిపారు.ఎన్నాళ్లుగానో ఉన్న సమస్యకు పరిష్కారం చూపడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.రహదారి నిర్మాణం పూర్తయిన అనంతరం వాహనదారులు, పాదచారులకు మరింత సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి.ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్,సాబాధ విజయ్ కుమార్,రాచూరి రాజశేఖర్,రాజ్ కుమార్,బిట్కూరి సతీష్,పని పరిశీలకుడు రాజు,సాయితేజతో పాటు కాలనీ పెద్దలు పాల్గొని పనులను పరిశీలించారు. కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను కూడ దశలవారీగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## మదర్ తెరిసా సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో మానవతా విలువలను పెంపొందించాలి

**మదర్ తెరిసా జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ల పంపిణీ.**

**కొత్త కోట, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

మానవత్వానికి ప్రతీకగా,తన నిస్వార్థ సేవతో కోట్లాది హృదయాలను తాకిన కరుణామూర్తి,నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, భారతరత్న మదర్ తెరిసా 116 వ జయంతి సందర్భంగా జె.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో కొత్తకోట బైపాస్ రోడ్డులో గల మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.మదర్ తెరిసా తన జీవితాన్ని పేదలు, అనాథలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవ చేయడానికే అంకితం చేశారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆమె సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంతో పాటు, అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ కౌన్సిలర్ ఎన్.జె. బోయేజ్, మాజీ వార్డు సభ్యులు సుభాష్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి.నిక్సన్, జె.ఎస్.ఆర్.ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు జె.భక్తరాజు, జే.అమృతరాజు,జె.మహిమ రాజు,సతీష్ రాజు,కర్ణ కుమార్, పాస్టర్లు నతానియల్, సుందర్, ఆసుపత్రి సిబ్బంది నాగమణి,ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ,పుష్పలత,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త మహమ్మద్ జీవితం సర్వమానవాళికి ఆదర్శం..





ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న నాయకులు

**మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో ముస్లిం మతపెద్దల సందేశం..**

**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు..**

**ముస్లింల ర్యాలీ,రక్తదాన శిబిరం**

**రాజేంద్రనగర్,ఆగస్టు26(ప్రభాత ఉదయం)**

ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక నమాజ్లు నిర్వహించి,అనంతరం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర,ఆయన బోధనలు,ఇస్లాం ధర్మం విశిష్టతను మతపెద్దలు వివరించారు.ఈ వేడుకల్లో నియోజకవర్గంలో పురవీధులు మహమ్మద్ ప్రవక్త ప్రేమతో మార్మోగాయి.ఈ సందర్భంగా హసన్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఇంద్రనగర్,హసన్ నగర్లోని అక్బరీ ఈద్గా వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.హసన్ నగర్కు చెందిన యువకులు పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.అనంతరం మత పెద్దలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీ నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ...ప్రవక్త మహమ్మద్ చూపినప్రేమ, శాంతి,దయ, సోదరభావం, సత్ప్రవర్తనా సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.విశ్వమానవాళికి చిట్టచివరి ప్రవక్తగా హజ్రత్ మహమ్మద్ ప్రవక్త చూపిన జీవన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ముస్లిం మత పెద్దలు సూచించారు.ప్రవక్త మహమ్మద్ తన జీవితాంతం సత్యం,న్యాయం,సమానత్వం,కరుణ,సహనం, సోదరభావాన్ని చాటిచెప్పారని తెలిపారు.కుల, మత,వర్గ భేదాలకు అతీతంగా ప్రతి మనిషిని గౌరవించడం,పేదలు,నిరుపేదలు, అణగారిన వర్గాల పట్ల దయతో వ్యవహరించడం ఆయన బోధనల సారమని పేర్కొన్నారు.సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనేలా ప్రతి ఒక్కరూ ప్రవక్త బోధనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో బీఆర్ఎస్ సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్,సాదిక్ బిన్ యూసుఫ్,అష్రఫ్,అమీర్,ఘౌస్, కరీం, ఎంఐఎం నాయకులు: రబ్బానీ,మొహమ్మద్ జహంగీర్, ముక్రం, ముస్తఫా,అక్బరీ మస్జిద్ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్,బాబా సమద్ మొహమ్మద్ నూరానీ,మస్జిద్ అధ్యక్షులు మొహమ్మద్ అన్సారీ,అలాగే సయీద్,జావీద్, వహీద్,నమ్మ ఖాన్,ముస్లిం మతపెద్దలు,యువత,భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




కారు దొంగతనం చేసిన పాత నేరస్థుడు అరెస్ట్

## మిలాద్ ఉన్ నబీ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లడానికి కారు దొంగిలించిన పాత నేరస్థుడి అరెస్ట్

**బుద్వేల్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కర్ణాటక లోని బీదర్ జిల్లా హాలిఖేడ్ తాలుకా, హిలాల్పూర్ లోని తర స్వగ్రామానికి వెళ్లి, అక్కడ ఉన్న నాసిర్ షా దర్గా సమీపం లోని శ్మశానవాటిక లో తన తండ్రి సమాధి ని చూడటం కోసం కారు ను దొంగిలించి పారిపోయిన పాత నేరస్థున్ని అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్ కు తరలించారు. నిందితుని నుంచి హ్యుందాయ్ ఐ20 కారు (టీజీ07 ఎడి 2657)ను, 11 గ్రాముల బంగారు ఉంగరాలు రెండు, ఒక ల్యాప్ టాప్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.9లక్షలు ఉంటుంది. వివరాలను అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య వెల్లడించారు. షాద్ నగర్ కు చెందిన ఉదయ్ కిరణ్, విశాల్ చారి లు బావ బావ మరిదిలు. ఈ నెల 22న అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 169 వద్ద ఉన్న పిస్తా హౌజ్ కు భోజనం చేయడానికి వచ్చారు. తమ హ్యుందాయ్ ఐ20 కారును వాలెట్ పార్కింగ్ సిబ్బందికి ఇచ్చి హోటల్ కు వెళ్లారు. అదే సమయంలో పాత నేరస్థుడు, ఉప్పర్పల్లి నివాసి సయ్యద్ మజహార్ అలియాస్ షూటర్ అలియాస్ తక్లా, అలియాస్ మజహార్ ఖాన్ (30) అక్కడికి వచ్చాడు. కర్ణాటక బీదర్ లోని తన స్వగ్రామానికి మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వెళ్లాలనుకున్నాడు. డబ్బులు లేకపోవడంతో దొంగిలించిన కారులో వెళ్లాలని నిర్ణయిం చుకున్నాడు. ఈ నేపథ్యంలో పిస్తాహౌజ్ హోటల్ వాలెట్ పార్కింగ్ లో పనిచేసే వారితో మాటా మాటా కలిపి వారు చూడనప్పుడు రెండు కార్ల తాళాలు తీసుకున్నాడు. కార్లు పార్కింగ్ చేసి ఉన్న ప్రాంతానికి వెళ్లి ఒక కారు తాళం నొక్కగా ఐ20 కారు తాళం తెరుచుకుంది. దీంతో తాను వాలెట్ పార్కింగ్ సిబ్బంది. తాళాలు పెట్టే దగ్గరనుంచి తీసుకువచ్చిన ఇంకో తాళాన్ని అక్కడే పారవేసి ఐ20 కారులో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితులు ఉదయ్ కిరణ్, విశాల్ చారి లు తమ కారు పోయిన విషయమై అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు కారు ను దొంగిలించిన సయ్యద్ మజహార్ (30) ను బుధవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి కారు తో పాటు 11 గ్రాముల బంగారం, ఒక లాప్టాప్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పాత నేరస్థుడని, అతనిపై గతంలో గుడి మల్కాపూర్, లంగర్ హౌజ్, సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. రిమాండ్ కు తరలించిన అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**బుద్వేల్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం):**



పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. హైదర్షగ్గీడ లో నివాసం ఉండే జగన్ (42) వాచ్మెన్ గా పనిచేస్తాడు. ఈ నెల 23వ తేదీన డ్యూటీకి వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. మూడు రోజులైన తిరిగి ఇంటికి రాలేదు. జగన్ సోదరుడు జనార్ధన్ ఆయన కోసం ఎంత వెదికిన ఫలితం లేకుండా పోయింది. రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బుద్వేల్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**



అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 141 వద్ద గుర్తు తెలియని 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడని పోలీసులకు స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా, అప్పటికే ఆయన మరణించి ఉన్నాడు. స్థానికంగా అతను భిక్షాటన చేస్తు జీవనం సాగిస్తుంటాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించిన అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతిక

**జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, పట్వారీ శశిధర్**

**కూకట్ పల్లి, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఖాజా నగర్లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ తో కలిసి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం, సేవా స్ఫూర్తికి ప్రతీకలని అన్నారు. ఆయన చూపిన మార్గం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలోపేతమవుతాయని తెలిపారు.మత సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, పరస్పర గౌరవంతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మత పెద్దలు గౌస్ భాయ్, ఇస్మాయిల్, ఖైసర్, నవాజ్, షౌకత్ అలీ మున్నా, రెహ్మాన్, మున్నా, అలాగే శ్రీను నాగభూషన్, నారాయణ, రవీందర్, లక్ష్మణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, టీం పట్వారీ సభ్యులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## ఈ తరమే కాదు రాబోయే తరల్లో కూడ

# సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేత ఉండబోరు: ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

### కంచుపాడులో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభ

### చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన నేతలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు26(ప్రభాత ఉదయం)**





అట్టడుగు వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడిన కమ్యూనిస్టు నేత సూరవరం సుధాకర్ రెడ్డి అని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. బుధవారం అలంపూర్ నియోజకవర్గంలోని కంచుపాడు గ్రామంలో జరిగిన కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ మల్లు రవి,విశిష్ఠ అతిథిగా హాజరైన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత కొరకు సురవరం క్రీడా ప్రాంగణం, లైబ్రరీ,వసతి గృహాల రంగనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్ మాట్లాడుతూ ... ఈ తరమే కాదు రాబోయే తరల్లో కూడ సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నాయకుడు ఈ ప్రాంతం నుంచి ఉండబోరు అని అన్నారు .సురవరం ఆలోచన విధానానికి చాలా దగ్గర ఉండేవాళ్ళం కనుక ఈ ప్రాంతానికి సంబంధించి లిఫ్టులు,బీడీ కార్మికుల గోదాం,లాంటి ఆలోచనలు చేయడం జరిగింది.వారు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ వారి ఆలోచనలు మన అందరి మధ్యలో నిలిచి ఉంటాయని అన్నారు . మన అందరం కూడ వారి ఆశయ సిద్ది కోసం వారి ఆలోచనలను అమలుపరచడం కోసం అడుగులు వేయాలని కోరారు. సురవరం సుధాకర్ రెడ్డి వారి స్వగ్రామంలో ఒక ఐదు మంది కావాలని బీటీ రోడ్డు కావాలని నాకు స్వయంగా ఫోన్ చేయడం జరిగింది అని సంపత్ కుమార్ అన్నారు. వారు చివరి క్షణంలో కూడ వారి గ్రామ అభివృద్ధి కొరకు రోడ్డు, ఇందిరమ్మ ఇండ్లు అడగడం జరిగింది. అదే మాటను ఒకరోజు రవీంద్రభారతిలో వారి సతీమణి విజయలక్ష్మి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ కోరడం జరిగింది , ఎందుకు వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుధాకర్ రెడ్డి స్థాయికి ఇంత చిన్న కోరికను కోరకూడదు. వారి పేరును చిరస్థాయిగా నిలిచే విధంగా ఆలోచన చేస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగింది. దాంతోపాటు, ఇందిరమ్మ ఇల్లు బీటీ రోడ్డు పాఠశాల లాంటి నిర్మాణాల కోసం ముఖ్యమంత్రి దాకా అవసరం లేదు నా మిత్రుడు అలంపూర్ నియోజకవర్గ ఇన్చార్జి కార్యదర్శి కుమార్ ఉన్నారు. అని చెప్పి వెంటనే సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ తో మాట్లాడి సంపత్ కుమార్ లెటర్ అందిన 24 గంటల్లో కంచుపాడు గ్రామానికి మూడు కోట్ల రూపాయల బిటి రోడ్డును కోటి రూపాయలతో అత్యాధునిక పాఠశాల నిర్మాణం కొరకు ప్రొసీడింగులు జారీ చేశారు.ఈ విధంగా సురవరం సుధాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు . సంపత్ కుమార్ కి సుధాకర్ రెడ్డి గురువు లాంటివారని వారి అడుగుజాడల్లో వారి ఆలోచన విధానం సంపత్ కుమార్ ని రాజకీయం వైపు మరింత ఎక్కువ అడుగులు వేసేలా చేసిందని అన్నారు.కంచిపాడు గ్రామంలో ఈరోజు జరుగుతున్న వర్ధంతి కార్యక్రమంలో సురవరం సుధాకర్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి కోరిక మేరకు ఆ గ్రామంలో ఒక అంగన్వాడి కేంద్రంకి సంబంధించి భవనాన్ని , ఒక మహిళా సంఘ భవనాన్ని కోరడం జరిగింది అంతేకాకుండా గ్రామంలో చిన్న చిన్న సిసి రోడ్ల నిర్మాణం కూడా చేపట్టాలని సంపత్ కుమార్ ని కోరిన వెంటనే సంపత్ కుమార్ స్పందించి 24 గంటల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని సంపత్ కుమార్ వారి కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది.దాంతోపాటు ఆరోజు ఐదు ఇందిరమ్మ ఇండ్లు అడిగారు వాటిని వెంటనే ఇవ్వడం జరిగింది. వాటితో పాటు మరొక్క ఐదు నుంచి 10 ఇందిరమ్మ ఇండ్లను సూరవరం సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం మంజూరు చేస్తానని సంపత్ కుమార్ , సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గొర్రెలు , మేకలు కార్పోరేషన్ చైర్మెన్ సరిత తిరుపతయ్య తో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు ,చాడ వెంకటరెడ్డి ,హాజరయ్యారు,వీరితో పాటు అలంపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ దొడ్డప్ప వైస్ చైర్మన్ కుమార్ , నివారణ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమల్,ఉండవెల్లి మండల అధ్యక్షుడు వెంకటేశు ,మాజీ అధ్యక్షుడు గోపాల్ ఉ ఒడవెల్లి సర్పంచ్ల సంఘం అధ్యక్షులు నాగరాజు, కంచిపాడు గ్రామ నాయకులు రమాచారి, జోగుల రవి, రాముడు, నల్లారెడ్డి, తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.



## గోశాలలో కోడెల మృతి.. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**కరీంనగర్/రాజన్న సిరిసిల్ల , ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ తిప్పాపూర్ గోశాలలో ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. గోశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గోశాలలో కోడెల సంరక్షణ, నిర్వహణపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.మృతిచెందిన ఐదు కోడెల ఘటన నేపథ్యంలో వేములవాడలోని తిప్పాపూర్ గోశాలను బుధవారం ఆది శ్రీనివాస్ సందర్శించారు. గోశాలలో పరిస్థితులను పరిశీలించి, కోడెలకు అందుతున్న సంరక్షణ, ఆహారం, వైద్య సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా గోశాల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. అవసరమైన మేరకు కోడెలను ఇతర ప్రాంతాలకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు.భక్తులు సమర్పించే నిజ కోడెలను గోశాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రత్యేకంగా క్వారంటైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చే కోడెల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాతే వాటిని ఇతర కోడెలతో కలపాలని సూచించారు. దీనివల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అవకాశం ఉంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు.అలాగే, పాలు మానేసిన కోడెలను మాత్రమే భక్తులు స్వామివారికి సమర్పించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గోశాలలో కోడెలకు మెరుగైన సంరక్షణ అందించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.ఐదు కోడెల మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.



## కేటీ దొడ్డిలో "వాల్మీకి విద్యా చైతన్య కమిటీ" ఏర్పాటు

**కేటీ దొడ్డి, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

సమాజంలో చదువును ప్రోత్సహించడం, విద్య ద్వారానే అన్ని రంగాల్లో ముందుకు వెళ్లవచ్చనే ఉద్దేశంతో జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కేటీ దొడ్డి మండలంలో "వాల్మీకి విద్యా చైతన్య కమిటీ" ని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులువా కుచినెర్ల సుధాకర్,ప్రధాన కార్యదర్శిగా కేటీ దొడ్డి జంగిలప్ప,కోశాధికారిగా చింతలకుంట శ్రీకాంత్ఉపాధ్యక్షులుగా నందిని చిన్న నాగేష్, కేటీ దొడ్డి సాయన్న, కుచినేర్ల కృష్ణ, సోంపురం మహేష్, పాగుంట కృష్ణ కాంతు, చింతలకుంట ఉమేష్, వెంకటేష్, మల్లాపురం లక్ష్మన్న, గువ్వలదిన్నె ఆనందు, ఓమిత్యాల వీరేశు, వెంకటాపురం శ్రీను, గంగనపల్లి జయన్న, కొండాపురం గోపి, రంగాపురం వీరేష్, మల్లాపురం రవికను ఎనుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షులు మేడికొండ ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి జె. ఎల్ల స్వామి, మాజీ అధ్యక్షులు తుమ్మలచెరువు ఆంజనేయులు, కేటీ దొడ్డి మండల సేవా సంఘం అధ్యక్షులు నందిన్నె నాగేష్, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్వారం తిమ్మప్ప, గొందిమల్ల రామకృష్ణ, నందిన్నె మల్లికార్జున్ పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే కేటీ దొడ్డి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు తిప్పన్న, నందిన్నె గ్రామ సర్పంచ్ వెంకటేష్, గువ్వలదిన్నె సర్పంచ్ ఆంజనేయులు, మండల వాల్మీకి నాయకులు కొండన్న, రవిబాబు, పలు గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు మరియు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అంజయ్య నగర్‌లో నిలిచిన ప్రమాద భయం:

### వేలాడుతున్న కేబుల్ వైర్ల సమస్యకు తక్షణ పరిష్కారం!

### నాయకుడు ఆంజనేయులు సాగర్ చొరవతో కదిలిన విద్యుత్ శాఖ అధికారులు

### పాత వైర్లు తొలగించి, కొత్త కేబుల్స్ ఏర్పాటు

### ఏఈ కిషోర్ కుమార్, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు

**శేరిలింగంపల్లి :ఆగస్టు 26, (ప్రభాత ఉదయం)**



ప్రమాదకరం మారిన విధ్యుత్ వైర్లలను అధికారులకు చూపిస్తున్న అంజనేయులు సాగర్...

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో గత రెండు సంవత్సరాలుగా ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్న వేలాడుతున్న కేబుల్ వైర్ల సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలోని రహదారులపై వైర్లు ప్రమాదకరంగా కిందికి వేలాడుతుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ వైర్ల వల్ల ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు ప్రాణాలు గుప్పెట్లో పట్టుకుని గడిపేవారు. ఈ తీవ్రమైన సమస్య డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ అధికారుల దృష్టికి తీసుకొనిళ్లడంతో తక్షణమే స్పందించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ పరిస్థితి తీవ్రతను విద్యుత్ శాఖ ఎలక్ట్రికల్ ఏఈ కిషోర్ కుమార్ కి వివరించి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు సాగర్ కోరారు. నాయకుని విజ్ఞప్తికి విద్యుత్ అధికారులు వెంటనె స్పందించారు. విద్యుత్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగి ప్రమాదకరంగా ఉన్న పాత వైర్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో నూతన కేబుల్ వైర్లను అమర్చారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజల భద్రతను ఖరారు. చేసిన ఎలక్ట్రికల్ ఏఈ కిషోర్ కుమార్ కి, లైన్మెన్ అశోక్ రెడ్డి కి ఆంజనేయులు సాగర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పట్ల ఇదే రీతిలో తక్షణమే స్పందిస్తూ, సమర్థవంతమైన సేవలు అందించాలని ఆయన కోరారు. సమస్య తీరడంతో స్థానిక కాలనీ ప్రజలు ఆంజనేయులు సాగర్ కి, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



సేవారత్న పురస్కారాలందుకున్న ప్రముఖులు...

## మదర్ థెరిసా మార్గం అనుసరణీయం హెచ్‌సీయూ పూర్వ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

### మాదాపూర్ స్వాతి హైస్కూల్‌లో ఘనంగా 'సేవారత్న' పురస్కారాల ప్రదానం

**శేరిలింగంపల్లి :ఆగస్టు 26, (ప్రభాత ఉదయం)**

"మానవ సేవే మాధవ సేవ" అనే సూత్రాన్ని నమ్మి సమాజంలోని అట్టడుగు వర్గాలు, అనాథలు, రోగుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది మదర్ థెరిసా అని హెచ్‌సీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. బుధవారం మాదాపూర్ లోని స్వాతి హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా, రాగం మల్లికార్జున యాదవ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ముందుగా మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1950లో కేవలం 13 మంది సభ్యులతో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'ని స్థాపించిన మదర్ థెరిసా దాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం అనన్యసామాన్యమని పేర్కొన్నారు. ఆమె స్థాపించిన 'నిర్మల్ హృదయ్', 'శిశు భవన్' వంటి సంస్థలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనాలని కొనియాడారు. వివిధ రంగాల ప్రముఖులకు 'సేవారత్న' పురస్కారాలు సమాజంలో అంకితభావంతో సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సేవారత్న' పురస్కారాలను (దుశ్శాలువ, జ్ఞాపిక, పగిడి, తాంబూలంతో) అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఎం. అరుణ ఎం. వెంకటరావు డాక్టర్ కె. అరుణశ్రీ,డాక్టర్ రాజ్ కుమార్ జాయ్ ఫౌండేషన్, జి.ఎస్.డి. గుప్తా రిటైర్డ్ బీహెచ్ ఇఎల్ ఏజీఎం, షిరిడీ సాయిబాబా అసోసియేషన్ మదర్ థెరిసా భౌతికంగా లేకపోయినా ఆమె చూపిన దయ, కరుణ నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని స్వాతి హైస్కూల్ ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఈ పురస్కారం తమపై బాధ్యతను మరింత పెంచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, డా. రామన్న, డి.వి.కె.రావు, సుబ్బారావు, వాణీ సాంబశివరావు, విష్ణు ప్రసాద్, పాలం శీను, శివరాం రెడ్డి, బాలన్న, డా.సాంబశివరావు, శాంతి కుమార్, డా.లతాగుప్త, సత్యనారాయణ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదకర గుంతలకు మట్టి వేసి నిరసన తెలిపిన కేటి దొడ్డి మండల బిఆర్ఎస్ యువ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు26 (ప్రభాత ఉదయం)**



గద్వాల--రాయచూరు ప్రధాన రహదారిపై కేటీ దొడ్డి బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన ప్రమాదకర గుంతలపై యువ నాయకుడు కొండాపురం గాజుల కృష్ణ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు.గుంతల్లో మట్టి వేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా పూడ్చే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రధాన రహదారిపై గుంతలు ప్రమాదకరంగా మారాయని, ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రమాదకర గుంతలను డాంబర్‌తో శాశ్వతంగా పూడ్చి రహదారిని మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. "గుంతలు పూడ్చడం మా పని కాదు.. కానీ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి." అని ఆయన కోరారు.



## వ్యవసాయ విద్యార్థుల ప్రదర్శనకు ప్రశంసల వెల్లువ

**కరీంనగర్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

రామడుగు మండలం వెలిచాల గ్రామంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ విద్యా కార్యక్రమం లో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన పీఆర్ఏ ప్రదర్శన ఆకట్టుకుంది.గ్రామ పంచాయతీ ఆవరణలో విద్యార్థులు గ్రామస్తులు, రైతులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారంతో వ్యవసాయ పరిస్థితులు, నేలల స్వభావం, పంటల సరళి, నీటి వనరులు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను విద్యార్థులు (గ్రామ వనరుల పటం) ద్వారా చక్కగా ప్రదర్శించారు.ఈ ప్రదర్శనను తిఆర్వికె కోఆర్డినేటర్ డా. పి. మధుకర్ రావు, వెలిచాల గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరై పరిశీలించారు.ఈ సందర్భంగా డా. పి. మధుకర్ రావు మాట్లాడుతూ.. ఇలాంటి క్షేత్రస్థాయి పీఆర్ఏ కార్యక్రమాల వల్ల విద్యార్థులకు రైతుల వాస్తవ సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పడుతుందని, భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేయడానికి ఇది దోహదపడుతుందని అన్నారు.సర్పంచ్ వీర్ల నర్సింగరావు మాట్లాడుతూ.. తమ గ్రామాన్ని ఎంపిక చేసుకుని అధ్యయనం చేసిన విద్యార్థుల కృషిని అభినందించారు. విద్యార్థులు చూపిన చొరవ, గ్రామ సమస్యలపై వారికున్న ఆసక్తి అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్ వాడీ టీచర్లు, స్థానిక రైతులు, మహిళలు మరియు వ్యవసాయ కళాశాల విద్యార్థి బృందం పాల్గొన్నారు



## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఘనంగా సన్మానించిన గౌడ కులస్తులు

**కరీంనగర్, ఆగస్టు 26 (ప్రభాత ఉదయం)**

చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంను రామడుగు గ్రామ గౌడ సంఘం కులస్తులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేతో సంఘానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గోనెపల్లి రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు అనుపురం రాజయ్య గౌడ్, సభ్యులు పూరెల్ల తిరుపతి గౌడ్, మూల శ్రీనివాస్ గౌడ్, గుర్రం శ్రీకాంత్ గౌడ్, పూరెల్ల మనోజ్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, పూరెల్ల రవి గౌడ్, అనుపురం పరుశరాములు గౌడ్, అనుపుర శ్రీనివాస్ గౌడ్, పూరెల్ల హరీష్ గౌడ్, గోనెపల్లి దినేష్ గౌడ్, అనుపురం రాజేశం గౌడ్, అనుపురం అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608